# రైలు

ప్లాట్‌ఫారమంతా జనం.

భారత ప్రజాస్వామ్యానికి ప్రతీకలా అక్కడ పేదలూ, నిరుపేదలూ, ధనవంతులూ, మధ్యతరగతి వాళ్లూ, విద్యార్థులూ, మేధావులూ, కార్మికులూ.... అన్ని మతాలకీ, అన్ని వర్ణాలకీ, అన్ని వర్గాలకీ చెందిన వారూ వున్నారు. వుండడం యిలా అలా కాదు. కిక్కిరిసి వున్నారు.

భారతీయుని పౌరహక్కులా వారందరి దగ్గరా టిక్కెట్లున్నాయి. అయితే అక్కడ టిక్కట్లు లేని దౌర్భాగ్యులూ, దొంగనాకొడుకులూ, లేకుండా వుంటారనా? వుంటారు. తప్పక వుంటారు. ఆ వెధవల్ని తప్పక చట్టప్రకారంగా శిక్షించవలసిందే.

శిక్షించాల్సిందేనని మీరూ, నేనూ అంటాం. కాని రామారావుగాడు మాత్రం అలా అనడు.

ఏ చట్టం కూడా మనిషికి కనీస అవసరాలు తిండీ, బట్టా, గూడూ కల్పించకుండా వాడిని శాసించడానికి, శిక్షించడానికీ వీలు లేదంటాడు. ఆ అధికారం ప్రభుత్వానికి లేదంటాడు. మన ప్రభుత్వాన్ని పచ్చిబూతులు తిడతాడు.

(ఆ వెధవ సంగతి మీకీ కథ పూర్తిగా చదివితే తప్పక తెలుస్తుంది.)

అదిగో రైలు వచ్చింది....

ప్లాట్‌ఫారం మీద ప్రళయం వచ్చింది.

అంతా రైలులోకి చొరబడాలనే తీవ్ర ప్రయత్నం.

స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్!

కిటికీలోంచి దూరేవాళ్ళు
ద్వారంలోంచి దూరలేకపోతున్నవాళ్ళు.

రామారావు నలిగిన బట్టలతో, చెదిరిన క్రాపుతో, ఒళ్ళంతా చెమట చెమటతో, చేతిలో లగేజీతో బోగీలోకి దూరలేక దూరుతూ కిందా మీదా అయిపోతున్నాడు.

నేనూ ఆ రైలులో ప్రయాణం చేయాల్సినవాడినే. కాని నేను వాడిలా కిందా మీదా అయిపోవడంలేదు. బట్టలు నలగకుండా, క్రాపు చెదరకుండా, నీటుగా, దర్జాగా నిలబడి సిగరెట్ కాలుస్తూ – రామారావు పాట్లు చూస్తూ నవ్వుకుంటున్నాను. నాకు చాలా సరదాగా వుంది.

వాడెప్పుడూ అలాంటి నిస్సహాయ స్థితిలో, దుర్భర దారుణ స్థితిలో వుండాలని, వుండగా నేను తనివితీరా చూడాలనీ నేనెప్పుడూ కోరుకుంటాను, నాది దుర్మార్గపు కోరిక మాత్రం కాదు. వాడు మాత్రం నిస్సందేహంగా దుర్మార్గుడే. అంతేకాదు దేశద్రోహి అనడానికి కూడా నేనేమీ జంకను.

రైల్లో ఫస్టు క్లాసూ, సెకండు క్లాసులా – మేమిద్దరం ఒకే కంపెనీలో ఉద్యోగస్థులం. అంతకు మించి వాడికీ, నాకూ సామ్యంలేదు. ఏ విధంగా చూసినా వాడు నా ఎదుట సమానంగా నిలబడలేడు. వాడు [illegible] – నేను [illegible]. వాడు నక్క – నేను నాగలోకం. వాడు పొట్టి – నేను పొడవు. వాడు లెఫ్టిస్టు – నేను రైటిస్టు. వాడిది ముతక ఎర్ర చొక్కా – నాది సిల్కు ఖద్దరు చొక్కా. నేను కంపెనీ యజమానినీ – వాడు చోటా కార్మిక నాయకుడు.

నాది ఫస్టుక్లాసు – వాడిది సెకండు క్లాసు.

రైలులో నాకున్న సదుపాయాలు వాడికెలా వస్తాయి? అసలు రైలులో ఫస్టుక్లాసు కంపార్టుమెంటుల్లా, టూ టైర్, త్రీ టైర్ లు మినహాయిస్తే – ఇంకేమి రైలు? అందుకే బోగీలు ఒకటీ, రెండు మాత్రమే వుంటాయి. వాడూ అందులో ప్రయాణం చేయాల్సినవాడు. నేను కాదు.

అదే వాడి ఏడుపు. వాడికి లేనిది నాకు వుందని. వెధవెప్పుడో,

ఆ ఏడుపుతోనే చస్తాడు. మా కంపెనీలో స్టాండింగ్ రూల్స్ ప్రకారంగా ఆఫీసరుకి మాత్రమే ఫస్టుక్లాసు అర్హత వుంది. ఎవరయినా సరే చట్టాలకి బద్ధులై వుండాల్సిందే గదా!

'రూల్సూ, చట్టాలూ, చట్టబండలూ "మీరు" మీకోసం చేసుకున్నవి. ఎవడికి తెలీదు మీ దగా' అంటాడు రామారావు. మన రాజ్యాంగ గ్రంథ పుస్తకాన్ని కాల్చేసి, బూడిదచేసి, ఆ బూడిదని నీటిలో కలుపుకొని తాగేసేటంత కసి వుంది వాడికి. అందుకనే నేను వాడిని దేశద్రోహి అనడం!

అసలు యాజమాన్యం చెప్పుచేతల్లో, ప్రభుత్వ అదుపు ఆజ్ఞలలో బుద్ధిగా నడిచే యూనియన్లు ఎన్నిలేవు? అందరిలాంటి యూనియన్ లీడరే అయితే— నాతో బాటే ఫస్టుక్లాసులో ప్రయాణం చేసేవాడుకదా. యజమానితో యజమాని కుక్క కూడా ఒకే బోగీలో ప్రయాణం చేస్తుంది కదా. అందులో తప్పేముంది? మన ప్రయోజనాలకి భంగం వాటిల్లకుండా అవసరమైతే చట్టాలు సవరిస్తాం!

కలకత్తాలో అఖిల భారత స్థాయిలో అన్ని కంపెనీల యజమానులకీ, యూనియన్ లీడర్లకూ కలిపి 'సామరస్యం, సహకారం, సుహృద్భావ వాతావరణం' ఉద్బోధించి– సమ్మెలూ, లాకౌట్లూ నివారించి ఉత్పత్తిపై అందరి దృష్టి కేంద్రీకరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఒక డెవలప్‌మెంటు ప్రోగ్రాం అరేంజ్ చేసింది. అందుకోసమే నేనూ, రామారావూ వెళుతున్నది కలకత్తా.

రామారావు ప్రజల మనిషట! అంచేతే గాబోలు సెకండు క్లాసు కూడా రిజర్వు చేసుకోకుండా, ఇప్పుడు ఆర్డనరీ బోగీలోకి ఎక్కడానికి అందరితోబాటు తన్నుకు చస్తున్నాడు.

ఏం! నన్ను చూశాడు. నవ్వేడు. పలకరించేడు. అలాగే 'నా లగేజ్ మీదగ్గర కాస్త వుంచండి' అంటే నేను కాదంటానా? అది అభిమానంకాదు. అహంకారం. కండకావరం. ఇప్పుడు చిత్రహింసలు పడుతున్నది వాడా? నేనా?

రామారావు ఎలాగోలా పాట్లుపడి, పెనుగులాడి, లోనికిదూరి

సీట్లులేక బెడ్డింగులనే సీటుగా వేసుక్కూర్చొని.... కారుతున్న చెమటను రుమాలుతో తుడుచుకోడం చూస్తుంటే— చెప్పొద్దూ— నాకు నిండా సంతోషమయింది.

వాణ్ని ఏడిపిద్దామని కిటికీ దగ్గరకెళ్ళి పలకరించేను "కంఫర్టబుల్‌గా వుందా" అని.

దానికి వాడు సమాధానంగా "కంపార్టుమెంటు పెద్దదే సార్" అన్నాడు నవ్వుతూ.

చూశారా వాడి టెంపరి సమాధానం.

నిన్ను పలకరించడం నాదే బుద్ధితక్కువనుకొని నా ఫస్టుక్లాసు లోకి ఎక్కేను.

మొత్తానికి రామారావు సంగతి ఏమోగాని నా ప్రయాణం మాత్రం సాఫీగా సాగింది. హాయిగా గడిచింది.

రామారావుకి ఈ ఫస్టుక్లాసు సుఖం ఈ జన్మలో రాదు. రాడానికి వీలులేదు. అంతే, వాడు ఆ కంపు క్లాసులోనే వుండడం న్యాయం. అలాగే నేను ఈ విశాలమైన, మెత్తని, సుఖమైన క్లాసులో వుండడం డబుల్ న్యాయం!

* * *

కేంద్రమంత్రుల, ప్రముఖ పారిశ్రామికవేత్తల, ప్రఖ్యాత కార్మిక నాయకుల ఉపన్యాసాలతో బ్రహ్మాండంగా పదిరోజులపాటు సాగవల్సిన ప్రోగ్రాం వెధవ రైల్వే సమ్మె వల్ల దెబ్బతింది.

మన ప్రభుత్వం ఎంత నచ్చచెప్పినా, ఎన్ని విజ్ఞప్తులు చేసినా మూర్ఖంగా, మొండిగా అఖిల భారత స్థాయిలో యావత్ రైల్వేవాలు సమ్మె చేయ పూనుకున్నారు. మనం ఎంత మర్యాదగా నచ్చజెప్పుతామో, అంత నిర్దాక్షిణ్యంగా సమ్మెల్ని అణచి కాలరాచేస్తామని వాళ్ళకి తెలీదు. తెలీక అజ్ఞానంగా, అనవసరంగా సమ్మె మేనెల 8వ తారీఖునుంచి మొదలు పెట్టేరు.

"ఇది చారిత్రాత్మకమైన సమ్మె. ఇది భారతదేశంలో విప్లవానికి నాంది. సమ్మె విజయవంతమయి తీరుతుంది" అన్నాడు రామారావు.

నా బొంద అని కొట్టిపారేశాను.

మొత్తానికి సమ్మెవల్ల మా ప్రోగ్రాం చెడింది.

ఆరవ తారీఖు లోపుగానే డెవలప్‌మెంటు ప్రోగ్రాం అయిపోయేటట్టు, 8 వ తారీఖులోగా ఎవరి కంపెనీలకి వారు వెళ్ళిపోయేటట్టు ప్రోగ్రాం మార్చి వేయబడింది.

అంచేత నేను ఆరవతారీఖు సాయంత్రం మెయిలుకి రిజర్వు చేయించుకుందామని ఎస్ప్లనేడ్‌లో రైల్వే ఆఫీసుకి వెళ్ళేను.

వెళితే ఆఫీసు సెలవు!

ఏమంటే 'మే డే' అట!

అంతవరక్కూ నాకు అర్థంకాలేదు. ఆరోజు ఎక్కడా ఏ షాపులూ లేవు. ఫేక్టరీలన్నీ శెలవు. అన్ని దిక్కులా ఎర్రెర్ర జెండాలు. గోడల నిండా ఎర్రటి బెంగాళీ అక్షరాలు. నా ఎదురుగుండా బ్రహ్మాండమైన ఊరేగింపు. బహుశా రామారావు ఆ ఊరేగింపులో వుండి వుంటాడని పించింది.

నాకు మటుకు మేడేకి ఇంత అట్టహాసం, ఆర్భాటం నచ్చలేదు. అసలు మేడే అంటే మన ఆంధ్రులకి ఎంతమందికి తెలుసు? ఏ ఫేక్టరీకి శెలవుంది? పోయిన ఏడాది రామారావు మాతో గొడవపెట్టుకొని మేడేకి సెలవు డిక్లేర్ చేయించేడు. కార్మికులకి సెలవంటే ఇష్టమేగాని మేడే అంటే ఇష్టమనుకోను. కాని నా అభిప్రాయం ఇక్కడ తలకిందులైంది.

అక్కడ కొంతదూరంలో బహిరంగసభ జరుగుతుంటే వెళ్ళేను. బాప్ రే! ఏం జనం! ఏం జనం! ఇసకవేస్తే రాలదంటారు. అలా వుంద క్కడ. ఇందాకటి బ్రహ్మాండమైన ఊరేగింపు. ఈ బ్రహ్మాండమైన సభ చూస్తుంటే నాకు అమిత ఆశ్చర్యంతోబాటు అత్యంత ఆందోళన గూడా కలిగింది.

కమ్యూనిజం దేశం, దేశమంతా నావాసలంలా వ్యాపించేయదు గదా అనిపించింది. నా ఉద్దేశంలో మాత్రం — ఈ దేశాన్ని అమెరికాకి అమ్మేసినా ఫర్వాలేదుగాని కమ్యూనిస్టుల చేతుల్లో పడనీయగూడదు కాక. పడనీయగూడదు. ఇంకేమైనా వుందా?

సరే ఆరోజు అలా అయిపోవడంతో మరుచటిరోజు టికెట్ రిజర్వేషన్‌కి రైల్వే ఆఫీసుకి వెళ్లేను. ఎంక్వయిరీ చేస్తే ఇంకేముంది! తొమ్మిది, పది తారీఖులదాకా రిజర్వేషన్లు అయిపోయేయట!

చచ్చాననుకున్నాను. కాని నాలాంటి వాళ్ళకి చచ్చే చావు రానీయకుండా కాపాడ్డానికి బోల్డుమంది బ్రోకర్సు వుంటారక్కడ. ఒక బ్రోకరు నా దగ్గరకొచ్చి టికెట్ ఇప్పించే ఏర్పాటు చేస్తానన్నాడు. మన దేశంలో ఉత్పత్తి ఏదీ కూడా దళారీలు లేకుండా వినియోగదార్లకి చేరదు. దీన్నే మన రామారావు 'దళారీ దోపిడీ వ్యవస్థ' అంటాడు వాడి భాషలో. కాని నా ఉద్దేశంలో దళారీ అనేది మన వ్యవస్థ యంత్రాంగంలో కీలకమైన పార్టు. ఉత్పత్తిదారునికి, వినియోగదారునికి మధ్య వంతెన లాంటివాడు.

అంచేత బ్రోకర్‌గారికి ముప్ఫయి రూపాయలు అదనంగా సమర్పించుకోగా ఆరవతారీఖు మెయిలుకి టికెట్ దొరికింది.

నేను ఆరోజు టికెట్ కోసం ఇంత వర్రీ అవగా రామారావు మాత్రం బేఖాతర్‌గా, నిర్లక్ష్యంగా వుండడం నాకు ఆశ్చర్యం వేసింది. వాడి ధైర్యమేమిటీ? ఎలా బండెక్కుదామనుకుంటున్నాడు? ఆ రోజు రైల్లో అసలు వేలాడ్డానికైనా చోటుంటుందా? భవనీయ్ వెధవ!— అనుకున్నాను.

*　　　*　　　*

ప్లాటుఫారమంతా జనం. జనం.

మేడే మీటింగునాడు జనం గుర్తుకొచ్చేరు. వాళ్ళని మన సి.ఆర్.పి. వాళ్ళు తరుముకొస్తే ప్లాట్‌ఫారంమీద కొచ్చి తలదాచుకున్నారా అనిపించేటంత జనం.

గాలి ఆడడం లేదు. ఉక్క, ఉక్కగా వుంది.

ఇంకా మెయిలు రాకపోవడంతో, ప్లాట్‌ఫారంమీద జనంవల్ల ఊపిరాడక పోడంతో అలా అరగంట బయటకు వెళ్లేను— హౌరా బ్రిడ్జి చూద్దామని.

నేను స్టేషనున్నుంచి బయటకి వెళ్తుంటే— లోనికి వస్తూ రామారావు ఎదురయ్యేడు.

"చాలా రష్‌గా వుంది ప్లాట్‌ఫారం. రైలెలా ఎక్కుతావ్?.... ఎనీవే బెస్టాఫ్ లక్" అన్నాను,

"సేమ్ టూ యూ" అన్నాడు వాడు.

* * *

నేను ప్లాటుఫారం మీదకి తిరిగి వచ్చేటప్పటికి-

నా కళ్ళు గిర్రున తిరిగేయి.

రైలంతా కిక్కిరిసిన జనం! కిటికీల్లోంచి, ద్వారంలోంచీ వేలాడు తున్నారు.

నేను నా ఫస్టుక్లాసు బోగీని వెదుక్కుంటూ నా బోగీ దగ్గరికి రాబోయేటప్పటికి దాన్నిండా కూడా పేక్ చేసేసినట్టు వేలాడుతూ జనం! అదిగో! వెధవ రామారావు కూడా ఆ బోగీలోనే వున్నాడు. నన్నుచూసి నవ్వుతున్నాడు!

నాకు గంగవెర్రులెత్తింది.

వాడినీ, వాళ్ళందర్నీ తన్నాలనిపించింది. ఒళ్ళు కుతకుత లాడి పోయింది.

"ఇది ఫస్టుక్లాసు బోగీ తెల్సా" -గట్టిగా అరిచేను.

ఎవరూ తమను కానట్టే వూరుకున్నారు.

వాళ్ళకి నా పోకెట్ లోంచి టికెట్ తీసి చూపించేను.

డోర్ దగ్గరున్న లిస్టులో నా పేరుని అండర్‌లైను చేసి చూపిం చేను.

ఎవరూ కదల్లేదు. దిగలేదు.

"దిగండి. మర్యాదగా దిగండి. ఇది నా బోగీ" అని అరిచేను.

"ఇంకా నయం, నీయబ్బదన్నావు కాదు"- అన్నాడెవడో లోపలి నుంచి.

మరో ఫస్టుక్లాస్ టికెట్ గలవాడు లోన్నించి - "ఎందుకొచ్చిన గొడవ మాష్టారూ - ఎక్కండి సద్దుకు పోదాం" అన్నాడు.

నేనందుకు ఒప్పుకోలేదు. నాతోబాటు కలిసి ఫైట్ చేసేబదులు చేత గాని చద్దమ్మలా సర్దుకు పోతున్నందుకు ఆగ్రహం వెలిబుచ్చేను. నాకు

సపోర్టు చేసేబదులు సర్దుకు పోదామనే బోడి సలహా పారేసినందుకు చెడా మడా తిట్టేను.

ఆ తిట్లకి రియాక్షను - బోగిలోంచి నవ్వులు!

నా తల కొట్టేసినట్టయింది. అక్కణ్ణించి కదిలేను. ప్లాట్ ఫారమంతా కలియ తిరిగేను. టి. సి. ని పట్టుకు వచ్చి చూడమన్నాను.

చూశేడు.

"మాటాడండి"

ఏం, మాటాడతాడు?

రైలు మరో రెండు నిముషాల్లో కదలబోతోంది.

టికెట్ చూపించి, దీనికి జవాబు ఏం చెప్తారు? అని టి. సి. ని ధనాయించి అడిగేను.

"అయామ్ సారీ, నేనేం చేయలేను" అన్నాడు టి. సి.

నాకు ఒళ్ళు మండిపోతోంది.

"ఇక మీరెందుకు వుండి? ఆ రైల్వే పోలీసుల్ని, ఆ పోలీసులూ చాలకపోతే రాష్ట్ర పోలీసుల్ని, కేంద్ర పోలీసుల్ని పిలిపించండి. పిలిపించి వీళ్ళందరి పిలక పట్టుకు దింపించేయండి. దిగకపోతే లాఠీచార్జీ చేయండి. ఇంకా దిగకపోతే కాల్చిపారేయండి.... ఏం చేస్తారో చేసి నా సీటు నాకిప్పించండి"

"మీరు మరోసారి అలా అన్నారంటే నిన్నూ, నన్నూ ఇప్పుడే అంతపని చేసేస్తారు వీళ్ళు.... వస్తాను" అని పరిగెట్టాడు టి. సి.

అంతలో గార్డు విజిల్.

పచ్చ జెండా రెపరెపలు.

నేను హడలి పోయేను.

వాళ్ళను దింపించి గాని రైలు ఎక్కకూడదనుకున్న వాణ్ణి - రైలు కదిలేటప్పటికి గబుక్కున ఎక్కేశాను.

నా లగేజ్ ఎక్కడో! నేనెక్కడో!

'లగేజ్, లగేజ్' అని గోల పెట్టేను.

అందరి చేతుల్లో బాస్కెట్ బాల్ ఆడబడి లగేజ్ నా దగ్గిరికి

చేరింది చివరికి! చేతులు దించడానికి గూడా చోటు లేక పోవడంతో అలా నెత్తిమీదే లగేజ్ పట్టుకునించున్నాను. ఒంటి కాలు మీద నిలబడ్డాను. చాలా దుర్భరంగా వుంది. చేతులు పీకేస్తున్నాయి. ఒంటికాలుపై నించోలేక పోతున్నాను. కోపంతో బాటు కన్నీళ్ళు కూడా వచ్చేయి.

కొంత సేపటికి వాళ్ళలో ఓ కూలి వెధవ ఏమనుకున్నాడో ఏమో లగేజ్ నా నెత్తిమీంచి దించి, నా కాళ్ళ దగ్గర పెట్టి, దానిపై కూర్చోడానికి చోటు చేసేడు. కూచున్నానుగాని ఏ మాత్రం సౌకర్యంగా లేదు. నా ఒళ్ళు కుతకుతలాడిపోయి 'ఇది చాలా అన్యాయం. అధర్మం' అని అరిచేను.

రెండుసార్లు అలా అరవనిచ్చి-

"ఎందుకలా అరుస్తావ్. నీకేకాదు ... ఈ రైల్లో పయనించే హక్కు ప్రతి వాడికీ వుంది. నీలాంటి ఇద్దరూ, ముగ్గురు కోసం .... మేమంతా ప్లాట్‌ఫారం మీద బోర్ల పడుకొని, రైలుని వదిలేయడానికి మేం వెర్రి వాళ్ళం కాదు. రైలంతా ఫస్టుక్లాసులూ, రిజర్వేషన్లే అయితే మాలాంటి వాళ్ళ సంగతేమిటి?" అంటూ కూకలేశాడు ఒకడు.

"నీ ఫస్టుక్లాసు టికెట్‌కి చోటు లేక పోవడం అన్యాయం! కాని మాకు రైల్లో కాస్త చోటైన లేకపోవడం న్యాయం! అదేనా మీరనేది? మీ ప్రయాణాలు, జీవితాలు సుఖంగా సాగాలి - అందుకు మా బతుకులు ప్లాట్‌ఫారం పాలై పోవాలి, బలై పోవాలి.... అంతేకదూ.... ఏం సిగ్గులేదయ్యా అన్యాయం, అధర్మం అని అరవడానికి" అన్నాడు ఇంకొకడు.

ఇదంతా రామారావు నవ్వుతూ వింటున్నాడు.

ఆ వెధవనవ్వు చూస్తే....నా ఒళ్ళు కంపరమెక్కింది. కుతకుతలాడిపోయింది. ఆగకుండా బూతులు మీద బూతులు వచ్చివచ్చిగా తిట్టేడును, కాని నోరు విప్పితే చాలు తన్నేసి, రైల్లోంచి కిందకి నన్ను తోసేసే లాగున్నారు జనం. ఏం చేస్తానిక! కిక్కురుమనకుండా ఆ ఉక్కలో, ఆ వేడిలో, ఆ ఉరుకులో కుక్కలా ముడుచుకుపోయి కూర్చున్నానే తప్ప నోరు విప్పలేదు!

అప్పుడు నాకు అర్థమైంది—'ఎప్పుడూ రోజులు మనవి కావని!'